క్లుప్తంగా

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

కోట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. గురువారం బీసీ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామని ఎంఈఓ మస్తానయ్య తెలిపారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయ క్రీడా పోటీలు

చిల్లకూరు: మండల స్థాయి ఉపాధ్యాయులకు గురువారం చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను చిల్లకూరు ఎంఈఓ–2 ఎండీ రవూఫ్ ఆరంభించారు. శుక్రవారం చిల్లకూరు మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

రన్నర్స్‌గా నిలిచిన డీవీ సత్రం



ట్రోఫీ అందుకుంటున్న డీవీ సత్రం క్రికెట్ టీమ్

దొరవారిసత్రం: గూడూరులో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని 25 మండలాలకు నిర్వహించిన టీసీఎల్(టీచర్స్ క్రికెట్ లీగ్) పోటీల్లో డీవీ సత్రం మండల ఉపాధ్యాయులు రన్నర్స్‌గా నిలిచారు. ట్రోఫీను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం రాత్రి అందుకున్నట్లు కెప్టెన్ విజయ్ తెలిపారు. అంతేకాకుండా బెస్ట్ బౌలర్, ఫీల్డర్‌గా కరటాముడి ప్రాథమిక పాఠశాలకు చెందిన టీచర్ సుమన్, మైలాంగం ప్రాథమిక పాఠశాల చెందిన టీచర్ వెంకటేశ్వర్లు ప్రత్యేక ట్రోఫీలను దక్కించుకున్నట్లు తెలియజేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



రామచంద్ర చిత్రపటానికి నివాళి

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలంలోని మేల్చూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు పి.సుబ్రమణ్యం కుమారుడు రామచంద్ర ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు మేల్చూరు గ్రామంలోని స్వగృహంలో బుధవారం నిర్వహించిన ఉత్తరక్రియల్లో వెందోటి కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. రామచంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, వెంకటకృష్ణయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కలువాయి(సైదాపురం): కలువాయి కనకమహల్ వీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాపూరు సీడీపీఓ సునంద ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ నిర్వాహకురాలు జయలక్ష్మిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట కలువాయి సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఉన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థి



రాయి యశ్వంత్

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి గ్రామానికి చెందిన రాయి యశ్వంత్ అనే విద్యార్థి మిజోరాం యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ కోర్సు చేస్తున్నాడు. లక్నోలోని ఇంటిగ్రల్ యూనివర్సిటీలో సీఈఏ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్కిటెక్చరల్ థీసిస్ జోన్ వలన్ పోటీలలో రాయి యశ్వంత్ ప్రతిభ చాటి ఐదో స్థానంలో నిలిచాడు. పదివేలు నగదుతోపాటు, ప్రశంసా పత్రం అందుకున్నాడు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం



తడ: తడ రైల్వేస్టేషన్ 2వ ప్లాట్ ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జికి సమీపంలో గుర్తు తెలియని మతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ప్లాట్‌ఫాంపై ఉన్న సిమెంట్ బల్లపై మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడు 40–45 వయస్సు కలిగి తెలుపు, నీలం గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

నాయుడుపేట టౌన్: మోటార్ బైక్‌ల చోరీలకు పాల్పడే ఇద్దరు దొంగలను పట్టుకుని అరెస్టు చేసి, గురువారం రిమాండ్‌కు పంపినట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ వెల్లడించారు. పట్టణ పరిధిలోని మల్లాం జాతీయ రహదారి కూడలి వద్ద సీఐతోపాటు ఎస్ఐ ఆదిలక్ష్మి తనిఖీలు నిర్వహిస్తుండగా నాగముంతల మణికంఠ, పెళ్లకూరు శ్రావణ్ కుమార్‌లను పట్టుకుని విచారించగా బైక్ దొంగలుగా గుర్తించారు. వీరి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

చికెన్ ధరలు 05-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	110
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	204
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	226
లేయర్ చికెన్	:	210

బడికెళ్లాలంటే నరకమే...

చిట్టమూరు: మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల విద్యార్థులు బడికి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. కొత్తగుంట గ్రామం నుంచి చిట్టమూరు మండలం తీరప్రాంత గ్రామం కుమ్మరిపాళెం వరకు సక్రమమైన రోడ్డు లేదు. అటవీ అడ్డంకులు ఉండడంతో తారు రోడ్డు వేయలేని పరిస్థితి. దీంతో ఆర్టీసీ బస్సులు తక్కువగానే తిరుగుతున్నాయి. రోడ్డు తరచూ మరమ్మతులకు గురికావడంతో విద్యార్థులు వెళ్లే సమయానికి ఉదయం, సాయంత్రం మాత్రమే తిప్పుతున్నారు. తీర ప్రాంత గ్రామాలైన ఎల్లూరు, బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం, పేరపాటితిప్ప గ్రామాల నుంచి 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు చిట్టమూరు, అరవపాళెం జెడ్పీ హైస్కూల్‌లో 50 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సులో వెళ్లి చదువుకుని తిరిగి ఆ బస్సులోనే ఇంటికి చేరుకుంటున్నారు. అయితే ఈ బస్సులో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో బస్సు నాయుడుపేటలోనే అధిక లోడు అవుతుంది. విద్యార్థులు చదివే అరవపాళెంకు రాగానే బస్సులో కనీసం నిలబడుకోవడానికి కూడా ఖాళీ ఉండడం లేదు. దీంతో విద్యార్థులు ఏమీ చెయ్యలేక గత్యంతరం లేని స్థితిలో ఆ బస్సులోనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గుంతలు, మిట్ట రోడ్డులో బస్సు కుదుపులకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.



బస్సులో నిలబడి ఇరుక్కుని వెళ్తున్న విద్యార్థులు

గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

కలువాయి(సైదాపురం): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు మండల సమావేశాలకు రాని తహశీల్దార్‌పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నెలలుగా మండల సర్వసభ్య సమావేశాలకు మండల తహశీల్దార్ రాకుండా కింద స్థాయి అధికారులను పంపడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తహశీల్దార్ గైర్హాజరు విషయమై సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు తెలిపారు. మండలంలోని కలువాయి, కుల్లూరు, చీపినాపి, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. మండలంలోని తోపుగుంట, బాలాజీరావుపేట గ్రామా ల్లో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉన్నాయని, ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయా గ్రామ సర్పంచ్‌లు కోరారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఏఓ జయకుమార్ సమాధానమిచ్చారు.

నీటి కొరతను పరిష్కరించండి

ఈ నెల 2న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఖాళీ బిందెలతో మహిళల నిరసన కథనంపై సభ్యులు స్పందించారు. ఈ విషయమై పెన్నా బద్వేల్ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మిని పలువురు సభ్యులు ప్రశ్నించారు. తక్షణమే తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ పెంచల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ భవానీ, ఏఈ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగని కూటమి నాయకుల దౌర్జన్యాలు



నిమ్మ తోట

సాక్షి టాస్క్‌ఫోర్స్: గూడూరు రూరల్ పరిధిలోని కొండాగుంట గ్రామానికి చెందిన రమణయ్య అనే చిన్న కారు రైతుకు సర్వే నెంబర్ 236–1ఏ, 4బీలో సుమారు 2.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో నిమ్మ సాగు చేసుకుంటుండగా ఇటీవల మరొకరికి లీజుకు భూమిని ఇచ్చాడు. అయితే దీనిపై కన్నేసిన స్థానిక కూటమి నాయకులు ఆ భూమిని తమకు అప్పగించాలని రైతుపై ఒత్తిడి చేశారు. ఆయన ఇప్పటికే లీజుకు వేరొకరికి ఇచ్చి ఉన్నందున భూమిని ఇవ్వలేనని చెప్పారు. దీంతో కూటమి నాయకులు గత నెల రోజుల నుంచి పలు పర్యాయాలు నిమ్మ తోటలోకి వెళ్లి అక్కడ చెట్లకు ఉన్న కాయలను దౌర్జన్యంగా కోసేస్తూ రైతును బెదిరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తనకు హక్కు ఉన్న భూమిపై మరొకరు దాడులకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



పారిచెర్లవారిపాళెంలో ఉపాధ్యాయులకు సత్కారం

చిల్లకూరు: మండలంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాశాఖలో మండల స్థాయిలో ఉత్తమ విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను గురువారం మండల విద్యాశాఖాధికారి రవూఫ్ ప్రకటించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. గుమ్మళ్లదిబ్బ జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని కేకే సుప్రియ, బల్లవోలు జెడ్పీహెచ్ఎస్ కె.వెంకటసుబ్బయ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్ వరలక్ష్మి(పెంటపాడు), ఎస్‌కే మహ్మద్ రఫీ(కొమరావారిపాళెం), టి.శైలాకుమారి (చిల్లకూరు మెయిన్), ఎ.అరుణమ్మ(చిల్లకూరు, హెచ్ డబ్ల్యూ), పి.ప్రభావతి(కడివేడు), సీహెచ్ హైమావతి(లింగవరం)ని ఎంపిక చేశారు. ముందస్తుగా డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి వేడుకలను చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పారిచెర్లవారిపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనసూయ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బీవీ కృష్ణయ్య గురువారం తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్.పెంచలయ్య, కె.కిశోర్, వి.మునికుమారి, షేక్ ఖాదర్ బాషా ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం



స్నేహలతను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా ఉన్న నరహరి స్నేహలత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైనట్లు డీఈఓ ప్రకటించారు. దీంతో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్నేహలతను విద్యార్థులతోపాటు ప్రధానోపాధ్యాయిని మంజుల, ఉపాధ్యాయులు సత్కరించి అభినందనలు తెలిపారు. లోతువానిగుంటలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ముందస్తుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రోటరీక్లబ్‌కు చెందిన ఆదవరం నాగూరయ్య, మునగాల కృష్ణారావు, బట్టా సుబ్రమణ్యంయాదవ్, పాఠశాల హెచ్‌ఎం మీనాకుమారి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు మోసం



మాట్లాడుతున్న సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి తదితర నాయకులు

- యూరియా కృత్రిమ కొరత
- 9న రైతులతో కలిసి నియోజకవర్గ కేంద్రంలో నిరసన ర్యాలీ
- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తీవ్రంగా విమర్శించారు. నాయుడుపేట పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం సంజీవయ్యతోపాటు వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి తదితర నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సంజీవయ్య మాట్లాడుతూ రైతులకు యూరియా అందుబాటులో లేకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరి నిలుచుని నానా అవస్థలు పడుతుంటే కూటమి ప్రభుత్వ మంత్రులు, నాయకులు రైతులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. యూరియాను 70శాతానికి పైగా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేసి, నియంత్రణ లేకుండా చేశారన్నారు. దీంతో రైతులు యూరియా బస్తాను రూ.200 నుంచి రూ.300 వరకు అధిక ధరలకు కొనుగోలు చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని సంజీవయ్య వెల్లడించారు. యూరియా కొరతతో రైతులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు పోరుబాట చేస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీన సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ ప్రభుత్వం అందించే జీలగలు, పచ్చిరొట్ట విత్తనాలు తదితర వాటిని సైతం పచ్చచొక్కాల వారికి అందజేస్తూ దగా చేస్తున్నారన్నారు. యూరియాను సైతం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రైతులకు కడుపుకోత మిగులుస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్‌యాదవ్, ఓజిలి, దొరవారిసత్రం మండల కన్వీనర్లు పాదర్తి హరినాథ్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, నాయకులు కటకం జయరామయ్య, బైనా మల్లికార్జునరెడ్డి, వేణుంబాక మునస్వామినాయుడు, మద్దాలి కీర్తి కిరణ్‌రెడ్డి, దారా రవి, అశోక్‌కుమార్, జి.సిద్ధయ్య, ముత్యాల్‌రెడ్డి, తన్నమాల రమణయ్య, రాహుల్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోన పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రాలు తీసుకువస్తున్న అర్చకులు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. దేవస్థానంలో నిత్యపూజల్లో తెలిసీతెలియక సంభవించే సకలదోష నివారణకు పాంచరాత్రాగమానుసారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తెలిపారు. ఈ పవిత్రోత్సవాలు మూడు రోజులపాటు సాగుతాయని, స్వామివారికి ప్రత్యేకంగా పట్టుతో తయారు చేసిన పవిత్రమాలలకు వివిధ పూజలు నిర్వహించి, స్వామివారిపై పవిత్రాలుంచి అభిషేకం చేస్తామని తెలిపారు. గురువారం రాత్రి స్వామి వారి అలంకార మండపంలో స్వామి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.అనంతరం శ్రీవారి నందనవనం నుంచి పుట్టమట్టి తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీవారికి పవిత్ర ప్రతిష్ఠ, అధివాసహోమం, పవిత్ర సమర్పణ, శాత్తుమొర నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం ప్రారంభమైందని అర్చకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన శంకర్

దొరవారిసత్రం: బైక్ అదుపుతప్పి పడిపోవడంతో శంకర్ గాయపడిన ఘటన దొరవారిసత్రం బ్రిడ్జిపై గురువారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు... శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన శంకర్ బుధవారం రాత్రి దొరవారిసత్రం మండలం టపాయిండ్లు గ్రామంలో బంధువుల పెళ్లికి బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో డీవీ సత్రంలోని బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో బైక్‌పై ప్రయాణించే శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసుల క్షతగాత్రుడిను డీవీ సత్రం పీహెచ్‌సీకి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం



వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్‌ను అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

చిల్లకూరు: రోటరీ క్లబ్ చేపట్టే ప్రతి సేవా కార్యక్రమంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యమిచ్చేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రవీంద్ర వెల్లడించారు. గూడూరు పటట్టంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పలు కార్యక్రమాలు చేపట్టారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అలాగే జడ్పీ బాలికల పాఠశాలకు ఫర్నిచర్ అందించారు. అలాగే సాయిరాం వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ అందించారు. రోటరీ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మునిగిరీష్, బాలక్రిష్ణంరాజు, పీవీ క్రిష్ణయ్య, శ్రీధర్‌రెడ్డి, రామ్ ప్రసాద్, వాసుగౌడ్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ సస్పెన్షన్‌పై నిరసన




సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు

సూళ్లూరుపేట: ఆర్టీసీ డిపోలో వి.పద్మ అనే కండక్టర్ రూ.30 అవకతవలకు పాల్పడిందని డిపో మేనేజర్ సస్పెండ్ చేసినందుకు నిరసనగా డిపో ఎదురుగా గురువారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. గడిచిన ఏడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే డిపో మేనేజర్ అసలేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఎన్ఎంయూ నాయకులు ఎం.శేఖర్ అన్నారు. డిపో అధ్యక్షుడు కె.కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగో రోజు గురువారం కూడా నిరాహార దీక్షను కొనసాగిస్తూ పద్మకు మద్దతు పలికారు. గురువారం కండక్టర్ కె.సురేష్, డ్రైవర్లు ఎస్‌కే షబ్బీర్ బాషా, పీవీ రమణయ్య, వై.విజయభాస్కర్ తదితరులు నిరాహారదీక్షలో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా ఎన్ఎంయూ సీనియర్ నాయకులు డి.పోలయ్య, జాయింట్ సెక్రటరీలు పి.సుబ్రమణ్యం, పి.రాధయ్య, ఎస్‌కే కాలేషా, కె.నాగరాజు, చైతన్య, ఎస్ఎం రెడ్డి తదితరులు సంఘీభావాన్ని ప్రకటించారు. కండక్టర్ పద్మకు జరిగిన అన్యాయంపై సోమవారం గ్రీవెన్స్‌డేలో స్థానిక ఆర్డీఓకి, తహశీల్దార్‌కు వినతిపత్రాలను అందజేసినా ఎవరూ స్పందించలేదని డిపో సెక్రటరీ ఎం.శేఖర్ అన్నారు. అక్రమంగా సస్పెండ్ అయిన పద్మను మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకు ఈ నిరసన కార్యక్రమాలు ఆగవని ఆయన చెప్పారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

నాయుడుపేట టౌన్: గత నెల 31వ తేదీ గాంధీపార్కు సమీపంలో అవధానం నరసయ్యపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడైన చేరెడ్డి సురేంద్రను గోమతి సెంటర్ వద్ద పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. నరసయ్యకు బాకీ ఉన్న రూ.160 నగదు అడిగినందుకు సురేంద్ర కత్తితో దాడి చేశాడు. ఈ కేసులో నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

నిమజ్జనానికి గణేశుడు



లడ్డు దక్కించుకున్న భక్తుడు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని దర్గా వీధిలో సినిమా సెట్టింగ్ మాదిరిగా ఆలయ నిర్మాణం చేపట్టి 22 అడుగులు భారీ వినాయకుని విగ్రహం పెట్టి 9 రోజులపాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. చివరి రోజు గురువారం నాడు క్రేన్‌తో వినాయకుని కొలువుదీర్చి ప్రధాన వీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగించారు. పోటాపోటీగా జరిగిన లడ్డూ వేలం పాటలో పట్టణానికి చెందిన భయ్యా జస్వంత్ అత్యధికంగా రూ.2.40 లక్షలకు పాడి స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. అదే విధంగా వినాయకుని మెడలో వేసిన నగదు మాలను యాదవ ఉద్యోగుల సంఘ నాయకులు భారతాల సాయిరామ్ కిషోర్ వేలంలో రూ.1 లక్షకు దక్కించుకున్నారు. కమిటీ నిర్వాహకుడు పోట్లపూడి రాజేష్ కమిటీ సభ్యులతో కలసి పాటలో దక్కించుకున్న వారికి అప్పగించారు.

చిల్లకూరులో..



నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం

చిల్లకూరు: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఒకొక్కటిగా నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం చిల్లకూరు దళితవాడలోని సుందరమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన బారీ విగ్రహాన్ని యువతీ, యువకుల కేరింతల నడుమ నిమజ్జనానికి తరలించారు.

రేపు గిరిజన భూసమస్యలపై రెవెన్యూ సదస్సు

కలువాయి(సైదాపురం): మండలంలోని గిరిజనుల భూసమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూరు ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సును గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓజిలి: కారు–స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో వి.పెంచలయ్య(45) మృతి చెందాడు. ఓజిలి మండలం అత్తివరం ఎస్సీ కాలనీ వద్ద ఈ ప్రమాదం బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు ఏర్పేడు మండలం పొంగూరు గ్రామానికి చెందిన పెంచలయ్య పిల్లల చదువులు నిమిత్తం వెంకటగిరి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. కుందాం గ్రామంలో మృతుని భార్య ప్రశాంతి తరపున బంధువులైన దాసరి శ్రావణి పెళ్లి చూపుల కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతా సంతోషంగా గడిపి తిరిగి వెంకటగిరికి బయల్దేరారు. ఈ క్రమంలో అత్తివరం ఎస్సీ కాలనీ వద్దకు వచ్చే సరికి కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో పెంచలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. భార్య ప్రశాంతి, కుమారుడు గౌతమ్‌లకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నాయుడుపేటలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మృతి చెందాడు. నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో చెత్త నిల్వలు లేకుండా చూడాలి

దక్కిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడ కూడా చెత్త నిల్వలు లేకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నెల్లూరు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు. మండలంలోని దేవునివెల్లంపల్లి పంచాయతీలోని వెంకటేశ్వరపురం గ్రామాల్లో తనిఖీలు చేశారు. వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ, సిబ్బంది ఉన్నారు.